క్లుప్తంగా

నేడు ఉచిత వైద్య శిబిరం

కందుకూరు: కందుకూరు, హైదరాబాద్‌లోని బాలాజీనగర్, ఆమనగల్లు లయన్స్‌క్లబ్‌ల సంయుక్త ఆధ్వర్యంలో మండల పరిధిలోని తిమ్మాపూర్‌లో మంగళవారం ఉచిత మెగా వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్లు లయన్స్‌క్లబ్ మండల అధ్యక్షుడు నిమ్మ అంజిరెడ్డి సోమవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. లయన్స్‌క్లబ్ మాజీ గవర్నర్ గంగాపురం చెన్నకిషన్‌రెడ్డి పర్యవేక్షణలో నిర్వహించనున్న శిబిరంలో సాధారణ వ్యాధులతో పాటు స్త్రీల అనారోగ్య సమస్యలు, మూత్ర పిండాల వ్యాధులు, మధుమేహం, దంత, కంటి సమస్యలు వంటి వాటికి నిపుణులైన వైద్య బృందంతో చికిత్సలు అందించనున్నామని చెప్పారు. ఈ అవకాశాన్ని గ్రామస్తులు సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

శ్రీధర్‌బాబుకు సన్మానం


మంత్రి శ్రీధర్‌బాబుతో జంగారెడ్డి, కేఎల్‌ఆర్

కందుకూరు: తుక్కుగూడ మున్సిపాలిటీ పరిధిలోని హార్డ్‌వేర్ పార్కులో శంకుస్థాపన కార్యక్రమంలో పాల్గొన్న అనంతరం మంత్రి శ్రీధర్ బాబు ఆ సమీపంలోని జెడ్పీ మాజీ ఫ్లోర్ లీడర్, టీపీసీసీ ప్రచార కమిటీ సభ్యుడు ఏనుగు జంగారెడ్డి నివాసానికి విచ్చేశారు. ఈ సందర్భంగా మంత్రిని ఏనుగు జంగారెడ్డి దంపతులు సన్మానించారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే కేఎల్‌ఆర్, నాయకులు దేవ భాస్కర్ రెడ్డి, కృష్ణనాయక్, సత్యనారాయణ, రాజేష్‌గౌడ్, నిరంజన్‌రెడ్డి, మాజీ సర్పంచ్ శ్రావణి పాల్గొన్నారు.

పశువైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలి


జీవానికి నట్టల నివారణ మాత్రలు వేస్తున్న పశువైద్యులు

కందుకూరు: పశువైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని పశు వైద్యులు డాక్టర్ షైన్‌షేక్, డాక్టర్ సంధ్యారాణి సూచించారు. సోమవారం మండల పరిధిలోని బేగరికంచెలో పశువైద్య శిబిరం నిర్వహించారు. పశువులకు గర్భకోశ వ్యాధులకు చికిత్సలు చేసి, దూడలకు నట్టల నివారణ మందులు తాగించారు. పెంపకందారులు పశువులకు అనారోగ్యం కలుగకుండా జాగ్రత్తలు పాటించాలన్నారు. ఏదైనా అనారోగ్య సమస్య ఏర్పడితే వెంటనే చికిత్స చేయించాలన్నారు. కార్యక్రమంలో పశువైద్య సిబ్బంది సామయ్య, రమేష్, లింగం, శివకుమార్, కృష్ణ, యాదయ్య, నర్సింహ, రైతులు పాల్గొన్నారు.

పనుల్లో నాణ్యత ప్రమాణాలు పాటించాలి

దిల్‌సుఖ్‌నగర్: అభివృద్ధి పనుల్లో నాణ్యత ప్రమాణాలు పాటించాలని కాలనీ ఆర్‌కేపురం కార్పొరేటర్ రాధాధీరజ్‌రెడ్డి అన్నారు. సోమవారం ఆర్‌కేపురం డివిజన్ రోడ్లను కార్పొరేటర్ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. కాలనీవాసులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా నాణ్యతతో కూడిన రోడ్లను వేయాలని ఆమె అధికారులకు సూచించారు. రోడ్లు, బస్తీలు, కాలనీల్లో రోడ్డు పనులు, ప్యాచ్‌వర్క్స్ పూర్తి చేసి కాలనీవాసులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా చూసుకోవాలన్నారు. బీజేపీ నాయకులు, కాలనీ వాసులు తదితరులున్నారు.

కార్మికుల సమస్యలు పరిష్కరించండి

సీఐటీయూ నాయకులు

చేవెళ్ల: శంకర్‌పల్లి పురపాలక సంఘం నూతన కమిషనర్‌గా వచ్చిన శ్రీనివాస్‌ను తెలంగాణ మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ యూనియన్, సీఐటీయూ ఆధ్వర్యంలో మార్యదపూర్వకంగా కలిశారు. సోమవారం వారు శంకర్‌పల్లి మండలకేంద్రంలోని మున్సిపల్ కార్యాలయంలో ఆయనను కలిసి పూలమాలలు వేసి స్వాగతం తెలిపారు. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి అల్లి దేవేందర్ మాట్లాడుతూ.. మున్సిపాలిటీలోని కార్మికుల సమస్యలను పరిష్కారానికి కృషి చేయాలని కోరారు. మున్సిపాలిటీ ఏర్పడిన నాటి నుంచి పనిచేస్తున్నారని చెప్పారు. కమిషనర్ శ్రీనివాస్ మాట్లాడుతూ.. కార్మికులు, ఉద్యోగులకు ఎలాంటి సమస్యలు ఉన్న వాటిని తన దృష్టికి తీసుకువస్తే పరిష్కరించేందుకు కృషి చేస్తానన్నారు. కార్యక్రమంలో యూనియన్ శంకర్‌పల్లి అధ్యక్షుడు బి. రమేష్, ప్రధాన కార్యదర్శి అమర్‌నాథ్, కోశాధికారి రాములు, ఉపాధ్యక్షుడు మోహన్, సత్యం, సహాయ కార్యదర్శి శ్రీకాంత్, ఉద్యోగులు తదితరులు ఉన్నారు.

సమస్యల 'కార్పొరేషన్'

కార్యాలయంలో సమస్యల తిష్ట

- కనీస సదుపాయాలకు నోచుకోని గదులు
- కరెంటు, నీటి సరఫరా లేక అవస్థలు పడుతున్న సిబ్బంది

బడంగ్‌పేట్: గ్రామ పంచాయతీ నుంచి అంచెలంచెలుగా అప్‌గ్రేడ్ చెంది కార్పొరేషన్‌గా అవతరించినప్పటికీ బడంగ్‌పేటలో సమస్యలు ఎక్కడ వేసిన గొంగళి అక్కడ అన్న చందంగా తయారయ్యాయి. కార్పొరేషన్ కోసం నూతన భవనాన్ని ఇటీవల దావుద్‌ఖాన్‌గూడలో రూ.కోట్లు వెచ్చించి నిర్మించారు. దాదాపు ఎకరంన్నర స్థలంలో కట్టిన బిల్డింగ్‌కు పార్కింగ్ స్థలం వదిలిపెట్టకపోవడంతో భవన సముదాయం కాస్తా కార్డతో నిండిపోతోంది. దీంతో కార్యాలయానికి ఎవరు వచ్చినా దారిలేని పరిస్థితి నెలకొంది. కార్యాలయం షిఫ్ట్ చేసినప్పుడు ఆయా విభాగాలకు చెందిన అధికారులు కమిషనర్ అనుమతి లేకుండానే నూతన భవనంలో గదులు తామే సొంతంగా కేటాయించుకున్నారు. అయితే మేయర్, డిప్యూటీ మేయర్, కమిషనర్ చాంబర్లకు తప్పా ఏ గదులకు కరెంట్ సరఫరా లేకపోవడం కొసమెరుపు. ఫ్యాన్లు లేవు, కంప్యూటర్లు పనిచేయవు, ఏసీలు ఫిటింగ్ కాలేదు. వచ్చిన ఫైళ్లతో ఉబ్బరానికి తట్టుకోలేక గాలికోసం ఊదుకుంటున్నారు. ఇది రాష్ట్రంలోనే నంబర్ టూ అని చెప్పుకుంటున్న బడంగ్‌పేట కార్పొరేషన్ హీనస్థితి. అయితే, దేశం మొత్తం ఆన్‌లైన్ పాలన నడుస్తుంటే బడంగ్‌పేట మున్సిపల్ కార్పొరేషన్‌లో మాత్రం నెల రోజులైనా కరెంట్ లేక ఆఫ్‌లైన్ పాలన కొనసాగుతోంది.. కమిషనర్లు, అధికారులు మారుతున్నారే కాని పైఅంతస్తుకు కరెంట్ మాత్రం రావడం లేదు. కనీసం పార్కింగ్ కోసం కూడా స్థలం ఉండటం లేదని కార్యాలయానికి వచ్చిన ప్రజలు తెలిపారు. కార్పొరేషన్ కార్యాలయంలోనే సౌకర్యాలు కల్పించుకోలేని అధికారులు వార్డుల్లోని సమస్యలు ఎలా పరిష్కరిస్తారని ప్రజలు ప్రశ్నిస్తున్నారు. గదుల్లో కనీసం కరెంట్ సరఫరా కూడా లేకపోవడంతో ఇబ్బందులు పడుతున్నామని అధికారులు తెలిపారు. వెంటనే విద్యుత్ సౌకర్యం కల్పించడంతో పాటు నీరు ఇతర సౌకర్యాలు కల్పించాలని వారు కోరుతున్నారు.


పార్కింగ్ స్థలం లేకపోవడంతో కార్యాలయం ముందు ఆపిన వాహనాలు

'పది'లో ఉత్తమ మార్కులు సాధించాలి

ప్రధానోపాధ్యాయుడు గోపాల్

చేవెళ్ల: పదవ తరగతిలో విద్యార్థులు మంచి మార్కులు సాధించాలని తంగడపల్లి పాఠశాల ప్రధానోపాధ్యాయుడు గోపాల్ అన్నారు. మండలంలోని తంగడపల్లి జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాలలో పదవ తరగతి విద్యార్థులకు గ్రామానికి చెందిన దాత శ్రీనివాస్‌చారి ఉచితంగా స్టడీ మెటీరియల్స్‌ను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా గోపాల్ మాట్లాడుతూ.. దాతలు పేద విద్యార్థులకు అందించే సహాయం మరువలేనిదని అన్నారు. ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు స్టడీ మెటీరియల్స్‌ను అందజేయటం అభినందనీయమన్నారు. ప్రతి ఒక్కరూ విద్యార్థుల కోసం ఏదో విధంగా సహాయ పడాలని కోరారు. దాత శ్రీనివాస్‌చారి మాట్లాడుతూ.. విద్యార్థులు బాగా చదివి పాఠశాలకు, గ్రామానికి మంచి పేరు తీసుకురావాలని కోరారు. పాఠశాల అభివృద్ధికి తమ వంతు సహకారం అందిస్తామని చెప్పారు.

అభయాంజనేయ విగ్రహ ప్రాణప్రతిష్ఠ

- ముఖ్య అతిథిగా హంపీ పీఠాధిపతి విద్యారణ్యభారతి
- పూజలకు హాజరైన సినీనటి, యాంకర్ అనసూయ


ప్రాణ ప్రతిష్ఠ నిర్వహిస్తున్న విద్యారణ్య భారతి


పూజలో పాల్గొన్న యాంకర్ అనసూయ

బడంగ్‌పేట్: బడంగ్‌పేట్ కార్పొరేషన్ పరిధిలోని బాలాపూర్‌లో సామల పాపిరెడ్డి గార్డెన్ వద్ద నూతనంగా నిర్మించిన అభయాంజనేయ స్వామి ఆలయంలో అభయాంజనేయస్వామి గణపతి నవగ్రహ శిఖర ధ్వజ విగ్రహ ప్రతిష్ఠాపన కార్యక్రమం సోమవారం హంపి పీఠాధిపతి విద్యారణ్యభారతి చేతుల మీదుగా ప్రాణప్రతిష్ఠ చేశారు. భక్తిశ్రద్ధలతో వేద మంత్రాల మధ్య జరిగిన కార్యక్రమానికి సినీ నటి, యాంకర్ అనసూయ భరద్వాజ, ఆకాశ్ పూరి, అను రావిపూడి, మహేశ్వరం ఎమ్మెల్యే సబితారెడ్డి, చేవెళ్ల ఎంపీ గడ్డం రంజిత్‌రెడ్డి, బడంగ్‌పేట మేయర్ పారిజాతారెడ్డి, స్థానిక కార్పొరేటర్లు పాల్గొన్నారు. ఆలయ వ్యవస్థాపక ధర్మకర్త, మాజీ ఎంపీపీ రంగారెడ్డి, కుటుంబసభ్యులు సామల ప్రవీణ్‌రెడ్డి, యజ్ఞయాగాదులు, హోమాలు నిర్వహించారు. విచ్చేసిన భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేశారు. అయోధ్య రామ మందిరంలోని శ్రీరాముడి విగ్రహాన్ని రూపొందించిన కృష్ణశిలతోనే ఈ అభయాంజనేయ స్వామి విగ్రహం, దేవాలయ గర్భగుడిని కూడా నిర్మించడం విశేషం. అంతేకాక గుడి ప్రాంగణంలోని వినాయక విగ్రహం 4 దశాబ్దాల పురాతనమైనది కావడం మరో విశేషం.

విద్యార్థులు క్రీడల్లోనూ రాణించాలి

ఎస్ఐ బల్‌రాం


విద్యార్థులకు ట్రోఫీ అందజేస్తున్న ఎస్ఐ బల్‌రాం, ఉపాధ్యాయులు

ఆమనగల్లు: విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లోనూ రాణించాలని ఆమనగల్లు ఎస్ఐ బల్‌రాం తెలిపారు. రాష్ట్రస్థాయి వాలీబాల్ టోర్నమెంట్‌లో ప్రతిభ కనబర్చిన బాలురు, బాలికల టీమ్‌ను ఆమనగల్లు పట్టణంలోని వివేకా విద్యాభారతి ఉన్నత పాఠశాలలో సోమవారం సన్మానించారు. అనంతరం ఎస్ఐ మాట్లాడుతూ.. గ్రామీణ ప్రాంతాల్లో అత్యంత ప్రతిభ కలిగిన క్రీడాకారులు ఉన్నారని.. అయితే సరైన ప్రోత్సాహం అందకపోవడంతో వారు రాణించలేకపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రతిభ కలిగిన క్రీడాకారులను గుర్తించి అన్ని విధాలుగా ప్రోత్సాహం అందిస్తే జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో రాణిస్తారని అన్నారు. విద్యార్థులు చదువుపై శ్రద్ధ చూపుతూనే క్రీడల్లోనూ రాణించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో వివేక విద్యాభారతి ఉన్నత పాఠశాల కరెస్పాండెంట్ శ్రీనివాసు, ప్రిన్సిపాల్ మహమూద్, బాలికల ఉన్నత పాఠశాల పీఈటీ సుశీల, ఉపాధ్యాయులు మల్లేష్, అంజి, స్వప్న, కరుణాకర్, విజేందర్, రత్నకుమారి తదితరులు పాల్గొన్నారు.

ఆదర్శప్రాయుడు సంత్ సేవాలాల్

హస్తినాపురం: బంజారాల ఆరాధ్య దైవం సద్గురు సంత్‌సేవాలాల్ మహరాజ్ అందరికి ఆదర్శప్రాయుడని ఐఏఎస్ అధికారి భారతి లక్పతినాయక్ అన్నారు. సోమవారం హస్తినాపురం డివిజన్ పరిధిలోని కాటం పార్వతమ్మ ఎన్‌క్లేవ్ కాలనీలోని పార్కులో సంత్‌సేవాలాల్ మహరాజ్ 285వ జయంతి వేడుకలను బంజారా జనతా సంఘం, ట్రైబల్‌స్టూడెంట్ ఫెడరేషన్ అధ్యక్షుడు భిక్షపతినాయక్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఐఏఎస్ అధికారి భారతి లక్పతినాయక్ సేవాలాల్ మహరాజ్ చిత్రపటానికి పూలమాలలు నివాళులర్పించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. సీఎం రేవంత్‌రెడ్డి సేవాలాల్ జయంతి రోజున బంజారా ఉద్యోగులకు ప్రత్యేక సీఎల్ సెలవు ఇవ్వడం సంతోషకరమన్నారు. కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకులు వడ్త్య వెంకటేష్ నాయక్, జానకీరాం నాయక్, శ్రీరాం నాయక్, ధంజీలాల్ నాయక్, వసురాం నాయక్, కృష్ణ నాయక్, పాండు నాయక్, బిక్కు నాయక్, కిషన్ నాయక్ తదితరులు పాల్గొన్నారు.

కరాటేలో సత్తాచాటిన విద్యార్థులు


షీల్డులు, సర్టిఫికెట్లతో విద్యార్థులు

ఇబ్రహీంపట్నం రూరల్: అంతర్జాతీయ కరాటే పోటీల్లో బొంగ్లూర్ మాస్టర్ మైండ్ పాఠశాల విద్యార్థులు సత్తా చాటారు. గోల్డ్, సిల్వర్ మెడల్స్ సాధించి శభాష్ అనిపించుకున్నారు. విద్యార్థులను ప్రిన్స్‌పాల్ సుష్మ సోమవారం అభినందించారు. ఈనెల 11న సరూర్‌నగర్ ఇండోర్ స్టేడియంలో జరిగిన అంతర్జాతీయ కరాటే పోటీల్లో మాస్టర్ మైండ్ పాఠశాలకు నాలుగు గోల్డ్ మెడల్స్, 3 సిల్వర్ మెడల్స్, మరో మూడు బ్రాంజ్ మెడల్స్ స్వీకరించడం సంతోషంగా ఉందని ట్రైనర్ మాస్టర్ జోగు రాజశేఖర్‌కు కృతజ్ఞతలు తెలిపారు.

సోను కరాటే అకాడమీ ఆధ్వర్యంలో..

ఆమనగల్లు: హైదరాబాద్‌లోని కోట్ల విజయభాస్కర్‌రెడ్డి ఇండోర్ స్టేడియంలో జరిగిన రుద్రమదేవి మెగా కప్ 4వ జాతీయస్థాయి కరాటే పోటీల్లో ఆమనగల్లుకు చెందిన సోను కరాటే అకాడమీ విద్యార్థులు అత్యంత ప్రతిభ కనబర్చారు. జాతీయ స్థాయి కరాటే పోటీల్లో పాల్గొన్న వేలాది మంది విద్యార్థుల్లో ఆమనగల్లు సోను కరాటే అకాడమీ విద్యార్థులు ప్రతిభ కనబర్చి బంగారు, రజత, కాంస్య పతకాలు సాధించారు. విజేతలకు ప్రముఖ సినీ నటుడు సుమన్, నిర్వాహకులు డాక్టర్ రవి, లక్ష్మి బహుమతులు అందించారు. జాతీయస్థాయి పోటీల్లో రాణించిన విద్యార్థులను సోను కరాటే అకాడమీ నిర్వాహకురాలు అభినందించారు.

ఘనంగా శివాజీ జయంతి



కందుకూరు: శివాజీ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న ఏబీవీపీ నాయకులు


పహాడీషరీఫ్: శివాజీ విగ్రహానికి నివాళులర్పిస్తున్న కార్తీక్ రెడ్డి

కందుకూరు: ఏబీవీపీ ఆధ్వర్యంలో ఛత్రపతి శివాజీ జయంతిని ఘనంగా నిర్వహించారు. సోమవారం మండల కేంద్రంలోని ప్రధాన చౌరస్తాలో శివాజీ చిత్రపటానికి పూలమాలతో నివాళులర్పించారు. ఏబీవీపీ మండల కన్వీనర్ సాయికిరణ్ మాట్లాడుతూ... ఛత్రపతి శివాజీ జీవితాన్ని యువత ఆదర్శంగా తీసుకోవాలన్నారు. హిందూ సంప్రదాయాల పరిరక్షణకు కృషిచేయాలని కోరారు. కార్యక్రమంలో ఏబీవీపీ నాయకులు మణికుమార్, అనిల్‌కుమార్, ప్రశాంత్, వంశీ, క్రాంతి, చందు, చంద్రశేఖర్, సందీప్, శివకుమార్, భానుప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

నవతరం యూత్ ఆధ్వర్యంలో..

నవతరం యూత్ అసోసియేషన్ అధ్యక్షుడు మహేందర్‌రెడ్డి ఆధ్వర్యంలో మండల కేంద్రంలో శివాజీ చిత్రపటానికి పూలమాలతో నివాళులర్పించారు. కార్యక్రమంలో ప్రశాంత్‌చారి, కార్తీక్, దీక్షిత్ రెడ్డి, జంగాచారి, అశోక్, రవి పాల్గొన్నారు.

శ్రీరాంకాలనీలో..

పహాడీషరీఫ్: ఛత్రపతి శివాజీ జయంతి వేడుకలను జల్‌పల్లి మున్సిపాలిటీలోని శ్రీరాంకాలనీలో సోమవారం ఘనంగా నిర్వహించారు. బీఆర్‌ఎస్ నేత పల్లోళ్ల కార్తీక్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరై ఛత్రపతి శివాజీ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో 18, 19 వార్డుల కౌన్సిలర్లు లక్ష్మీనారాయణ, శంకర్, కోఆప్షన్ మెంబర్ సూరెడ్డి కృష్ణారెడ్డి, నాయకులు శ్రీకాంత్, నిరంజన్, అర్జున్ తదితరులు పాల్గొన్నారు.


పహాడీ షరీఫ్: అల్మాస్‌గూడలో మేయర్ పారిజాతారెడ్డి


పహాడీ షరీఫ్: జయంతి ఉత్సవాల్లో ఎమ్మెల్యే సబితారెడ్డి


కందుకూరు: నవతరం యూత్ ఆధ్వర్యంలో

కంటి వైద్య శిబిరానికి స్పందన

ఆమనగల్లు: ఆమనగల్లు పట్టణంలోని ప్రభుత్వాస్పత్రిలో సోమవారం ఆమనగల్లు లయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఉచిత కంటి వైద్య శిబిరానికి విశేష స్పందన లభించింది. శిబిరాన్ని ప్రభుత్వాస్పత్రి వైద్యాధికారి డా.పరిక్షిత్ నరేందర్ ప్రారంభించారు. కంటి వైద్యులు చంద్రశేఖర్ ఆధ్వర్యంలో 95 మందికి కంటి పరీక్షలు నిర్వహించారు. ఇందులో 35 మందిని గుర్తించి కంటి ఆపరేషన్ల నిమిత్తం మహబూబ్‌నగర్‌లోని రాంరెడ్డి లయన్స్ కంటి ఆస్పత్రికి తరలించారు. ఈ కార్యక్రమంలో ఆమనగల్లు లయన్స్ క్లబ్ పీఆర్‌ఓ పాషా, ప్రభుత్వాస్పత్రి సిబ్బంది తిరుపతిరెడ్డి, వేణు తదితరులు పాల్గొన్నారు.

సీసీ రోడ్డు పనులు ప్రారంభం

కడ్తాల్: గ్రామాల అభివృద్ధిలో ప్రజలందరూ భాగస్వాములు కావాలని ఎంపీపీ కమ్లీమోత్యానాయక్ అన్నారు. సోమవారం కడ్తాల్ మండలం చరికొండ గ్రామ పంచాయతీ పరిధిలోని బోయిన్‌గుట్టతండాలో ఎంపీపీ పర్యటించారు. మండల పరిషత్ నిధులు రూ.5లక్షలతో నిర్మించనున్న సీసీ రోడ్డు నిర్మాణ పనులకు ఆమె భూమిపూజ చేశారు. మండలాన్ని అభివృద్ధిలో ఆదర్శంగా నిలిపేందుకు కృషి చేస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపీటీసీ రాములుగౌడ్, నాయకులు సోమ్లానాయక్, మోతీలాల్, విజేందర్, రఘురాములు తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడి మృతి

హస్తినాపురం: ద్విచక్రవాహనం అదుపుతప్పి డివైడర్‌ను ఢీకొట్టడంతో తీవ్రంగా గాయపడి ఓ యువకుడు అక్కడికక్కడే మృతి చెందిన ఘటన వనస్థలిపురం పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం .. సోమవారం తెల్లవారు జామున ఒకటిన్నర గంటల ప్రాంతంలో నగరంలోని ఎన్టీఆర్‌నగర్‌కు చెందిన చింతకింది వినోద్ (23) ఇంజాపూర్‌లో తన మిత్రుడి పుట్టినరోజు వేడుకల్లో పాల్గొని తిరిగి నగరానికి వస్తుండగా.. ద్విచక్రవాహనం అదుపుతప్పి బీఎన్‌రెడ్డినగర్ దగ్గర డివైడర్‌ను ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో వినోద్ తలకు తీవ్ర గాయాలు కావడంతో స్థానికులు 108కు కాల్‌చేయడంతో చికిత్స నిమిత్తం వనస్థలిపురం ఏరియా ఆసుపత్రికి తరలించగా.. పరీక్షించిన వైద్యులు అప్పటికే మృతి చెందినట్లు ధ్రువీకరించారు. మృతుడి తండ్రి సత్యనారాయణ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఉస్మానియా ఆస్పత్రికి తరలించి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

బీఆర్‌ఎస్ ఖాళీ కావడం ఖాయం


సమావేశంలో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే కేఎల్లార్

మాజీ ఎమ్మెల్యే కేఎల్లార్

మహేశ్వరం: కాంగ్రెస్ పార్టీలో చేరడానికి బీఆర్‌ఎస్, బీజేపీ నేతలు క్యూ కడుతున్నారని మాజీ ఎమ్మెల్యే, నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి కిచ్చెన్నగారి లక్ష్మారెడ్డి పేర్కొన్నారు. సోమవారం మండల పరిధిలోని అమీర్‌పేట్ సమీపంలోని ఆవుల శివాజీ ఫంక్షన్ హాలులో మన్సాన్‌పల్లి కాంగ్రెస్ సీనియర్ నాయకుడు, రేణుక ఎల్లమ్మ ఆలయ కమిటీ చైర్మన్ మురళీధర్‌రెడ్డి ఆధ్వర్యంలో కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తల ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. ఈ సందర్భంగా కేఎల్‌ఆర్ మాట్లాడుతూ.. కాంగ్రెస్ పార్టీ బలోపేతం కోసం ప్రతి నాయకుడు, కార్యకర్త పనిచేయాలన్నారు. త్వరలో జరిగే పార్లమెంట్ ఎన్నికల్లో చేవెళ్లలో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిని భారీ మెజార్టీతో గెలిపించి సోనియా గాంధీకి కానుకగా ఇస్తామన్నారు. బీఆర్‌ఎస్, బీజేపీలకు చెందిన పలువురు ప్రజా ప్రతినిధులు, నాయకులు కాంగ్రెస్ పార్టీలో చేరేందుకు ఆసక్తి కనబరుస్తున్నారన్నారు. ఎంపీ ఎన్నికల తర్వాత బీఆర్‌ఎస్ ఖాళీ కావడం ఖాయమన్నారు. ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా తీసుకొచ్చిన ఆరు గ్యారంటీలను ప్రతి కార్యకర్త ప్రజల దృష్టికి తీసుకెళ్లి భాగస్వాములను చేయాలన్నారు. పార్టీ కోసం కష్టపడిన నాయకులు, కార్యకర్తలకు తగిన గుర్తింపు ఇస్తామన్నారు. గ్రామాల్లో బూత్ స్థాయిలో పార్టీ బలోపేతం కోసం ప్రతి ఒక్కరూ పనిచేయాలని కోరారు. అంతకుముందు కాంగ్రెస్ నాయకుల ఆత్మీయ సమ్మేళనం ఏర్పాటు చేసిన మురళీధర్‌రెడ్డిని అభినందించి ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో మాజీ జెడ్పీ ఫ్లోర్ లీడర్ ఏనుగు జంగారెడ్డి, సీనియర్ నాయకులు.. దేవ భాస్కర్‌రెడ్డి, గోవర్ధన్‌రెడ్డి, యాదయ్య, ఈశ్వర్, హన్మంత్‌రెడ్డి, పాండు నాయక్, రమేష్, నర్సింహ పాల్గొన్నారు.

క్రికెట్ పోటీల కరపత్రాలు ఆవిష్కరణ


కరపత్రాలు ఆవిష్కరిస్తున్న విష్ణువర్ధన్‌రెడ్డి, నాయకులు

మంచాల: యువత సామాజిక బాధ్యతతో ముందుకు పోవాలని కాంగ్రెస్ పార్టీ జిల్లా నాయకులు, ఆరుట్ల మాజీ సర్పంచ్ కొంగర విష్ణువర్ధన్‌రెడ్డి అన్నారు. సోమవారం ఆరుట్లలో వేణుగోపాల స్వామి జాతర ఉత్సవాల సందర్భంగా యువజన కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో నిర్వహించే క్రికెట్ టోర్నమెంట్‌కు సంబంధించిన కరపత్రాలను ఆయన ఆవిష్కరించారు. ఆయన మాట్లాడుతూ.. యువత సమాజం పట్ల బాధ్యత, గౌరవంతో నడుచుకోవాలన్నారు. ఉన్నత లక్ష్యంతో ముందుకు పోవాలన్నారు. ఐక్యమత్యంతో కలిసి గ్రామ అభివృద్ధిలో భాగస్వామ్యం కావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఎంపీటీసీ సభ్యుడు కావలి శ్రీనివాస్, నాయకులు భాషా, రమేష్, మానయ్య గౌడ్, ఎల్లేష్, సురేష్, డాక్టర్ దశరథ, జంగయ్య గౌడ్, వెంకటేశ్, కృష్ణ, చంద్రకాంత్, యాదయ్య, శంకర్ పాల్గొన్నారు.